క్లుప్తంగా

రుణాలు రెన్యువల్ చేయాలి



కెనరా బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: స్థానిక కెనరా బ్యాంక్‌లో బంగారు రుణాలు తీసుకున్న వారితో వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలని సీఐటీయూ నాయకుడు లింగన్న, బీజేపీ నాయకుడు జిలకర ఆంజనేయులు కోరారు. బుధవారం వారు బ్యాంక్ మేనేజర్ అనూప్‌ను కలిసి, సమస్యలను విన్నవించారు. అసలు, వడ్డీ చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వడ్డీ మాత్రమే కటించుకుని రెన్యువల్ చేయాలని కోరారు. మేనేజర్ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వడ్డీతోనే రెన్యువల్ చేసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు రెండు మూడు రోజులు సమయం కావాలన్నారు. రుణాలు పొందిన వారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోండి



డ్రోన్‌తో మందులు పిచికారీ చేయడానికి సిద్ధం చేస్తున్న వ్యవసాయ అధికారులు

ఓడీచెరువు: వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సనావుల్లా కోరారు. సున్నంపల్లిలో రైతు ముక్కెర నరసింహులు తన పొలంలోని 13 ఎకరాల వేరుశనగ పంటకు డ్రోన్‌ను ఉపయోగించి క్రిమిసంహారక మందులు స్ప్రే చేసినట్లు ఆయన తెలిపారు. ఆరు నిమిషాల వ్యవధిలో ఎకరా వేరుశనగ పంటకు రూ.400 ఖర్చుతో పిచికారీ చేయొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి, రైతు సేవాకేంద్రం అధికారి రాఘవేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రిలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మాలధారులు, గురుస్వాములు సత్యనారాయణ స్వామి, పెద్దన్న స్వామి, రామాంజినేయులు స్వామి, విశ్వనాథ్ స్వామి తదితరులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 18 మెట్లకు (పడికి) పూలతో అలంకరించి భజనలు చేశారు. అనంతరం దాతలు మాలధారులకు అన్నదానం నిర్వహించారు.

వైభవంగా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

కదిరి టౌన్: అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప సన్నిధానంలో 48వ మండల పడి పూజా కార్యక్రమం బుధవారం ఉదయం మహాగణపతి హోమంతో ప్రారంభమైంది. తదనంతరం 48 కేజీల నెయ్యితో గురుస్వాములు అయ్యప్ప స్వామికి నెయ్యభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు కన్నెపూజ ప్రారంభం కాగా.. సాయంత్రం 6 గంటలకు అంగరంగ వైభవంగా పడిపూజ జరిగింది.

మారుమోగిన అయ్యప్ప నామస్మరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్ట సమీపాన అయ్యప్పస్వామి భజన మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి పి.జె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కన్నెస్వాముల లక్షార్చన పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

వెల్లివిరిసిన మతసామరస్యం




భోజనం వడ్డిస్తున్న షామీర్

పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలోని అయ్యప్ప మాలధారులకు వాటర్‌ప్లాంట్ నిర్వాహకుడు షామీర్ బుధవారం భిక్ష ఏర్పాటు చేశారు. మాలధారుల దీక్ష ముగిసే వరకు ఉచితంగా ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా చేస్తామని చెప్పారు. ముస్లిం అయ్యుండి అయ్యప్ప భక్తులకు సేవచేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు.

సోలార్ విద్యుత్‌పై రేపు అవగాహన సదస్సు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఆర్‌కే కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం పది గంటలకు విద్యుత్ వినియోగదారులకు ప్రధానమంత్రి సూర్యఘర్ (సోలార్) పథకంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తెలిపారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం మీడియాకు వెల్లడించారు.

వంట.. ధరల మంట



విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న కూరగాయలు



- సామాన్యులపై పెనుభారం
- దూసుకుపోయిన నిత్యావసరాల రేట్లు
- పెరిగిన బియ్యం, వంటనూనె, కూరగాయల ధరలు
- ధరల నియంత్రణను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

బత్తలపల్లి: నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతున్నాయి. సామాన్యులు కిరాణాషాపులకు, కూరగాయల మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఒక రోజు ఉన్న ధరలు, మరుసటి దినం ఉండటం లేదంటే అర్థం చేసుకోవచ్చు. ధరలు ఎలా పైపైకి ఎగబాకుతున్నాయో. చేతిలో ఉన్న డబ్బులకు ఏది కొనాలో, ఏది మానేయాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పూట గడవడం కష్టంగా మారింది. ధర్మవరం నియోజకవర్గంలో 1,09,431 కుటుంబాలు, 3,05,706 మంది జనాభా ఉన్నారు. వీరికి బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు, కోడిగుడ్లుతో సహా అన్నీ అందనంతగా ధరలు పెరిగాయి.

వంటింట్లో ధరల మంట

వంటింట్లో ప్రతి పూట అత్యవసరమైన బియ్యం ధరలు పెరిగిపోయాయి. సోనా బీపీటీ పాత బియ్యం రూ.5,500కు చేరుకుంది. కొత్త బియ్యం రూ.3,500 నుంచి రూ.3,600 వరకు అమ్ముతున్నారు. కందిపప్పు కేజీ రూ.170, మినపప్పు రూ.130, పెసరపప్పు రూ.130కు చేరుకున్నాయి.


ఆకాశాన్నంటున్న కూరగాయలు

కూరగాయల ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు. రోజూ వంటల్లో వాడే ఉల్లిపాయలు, టమాట ధరలు మోత మోగిస్తున్నాయి. మూడు నెలల నుంచి ఉల్లిపాయలు కేజీ రూ.80పైమాటే. ప్రతి కూరలో వాడే టమాట రూ.50కి చేరింది. ప్రస్తుతం మూడు కేజీలు రూ.50కు అమ్ముతున్నారు. వంకాయలు కేజీ రూ.40, బీరకాయలు రూ.50, క్యారెట్ రూ.80 పలుకుతున్నాయి. బెండ, దొండకాయలు రూ.40 పైమాటే. ఎన్నడూ లేనంతగా దోసకాయలు, అనపకాయలు, పొట్లకాయలు కూడా రూ.30 నుంచి రూ.40 పలుకుతున్నాయి. చిక్కుడు రూ.80కు పెరిగింది. ఆకుకూరలు కట్ట రూ.10 తక్కువ లేదు. అక్టోబర్, డిసెంబర్ మాసంలో వచ్చిన వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గి.. ధరలు పెరిగిపోయాయి.

ధరలపై నియంత్రణేదీ?

అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా ఇంత వరకు గత ధరలను తగ్గించడానికి చర్యలు తీసుకోకపోగా, ఇప్పుడు అధికంగా పెంచినా నియంత్రించలేక ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఒక వైపు డబ్బులు వేస్తూ, మార్కెట్‌లో ధరలు పెంచుతున్నారని ఆరోపించిన కూటమి నేతలు.. తాము అధికారంలోకి వచ్చాక ఎలాంటి పథకమూ అమలు చేయకపోగా నిత్యావసర వస్తువుల ధరలను మాత్రం అమాంతం పెంచేశారని ప్రజలు మండి పడుతున్నారు.

'ఎగ్'బాకుతోంది..




కోడిగుడ్డు ధర కొండెక్కింది. వేసవిలో ఎండ తీవ్రతతో ధరలు తగ్గినా.. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు తగ్గి వర్షాలు పడటంతో రోజువారి ఉత్పత్తి క్రమేణా తగ్గుతోంది. దీంతో డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం హోల్‌సేల్‌గా గుడ్డు రూ.6.50 ఉండగా, ప్రజలకు మాత్రం రూ.7 నుంచి 8కు విక్రయిస్తున్నారు. ఇంత ధర గతంలో ఎప్పుడూ నమోదు కాలేదని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు.

ధర్మవరం నియోజకవర్గ వివరాలు

మండలం	కుటుంబాలు	జనాభా
ధర్మవరం పట్టణం	63,186	1,22,874
ధర్మవరం రూరల్	12,798	50,607
బత్తలపల్లి	10,089	39,373
తాడిమర్రి	8,572	32,385
ముదిగుబ్బ	14,786	60,467

కొనేలా లేని వంట నూనెలు..



కేంద్ర ప్రభుత్వం వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో వంటనూనె ధరలు గత రెండు నెలల్లోనే కిలోపై రూ.40 దాకా పెరిగింది. వేరుశనగ నూనె కిలో రూ.180, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.150, నువ్వులనూనె రూ.480, కొబ్బరి నూనె లీటరు రూ.360కు చేరుకుంది.

ధరలు తగ్గించాలి



మార్కెట్‌లో పెరిగిన అన్ని రకాల నిత్యావసరాలు, కూరగాయల ధరలు తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి చర్యలు చేపట్టాలి. రూ.500 నోటు తీసుకుని మార్కెట్‌కు వెళ్లితే ఐదు రకాల వస్తువులు రావడంలేదు. గుడ్డు, చికెన్, మటన్ ధరలు అమాంతం పెరిగాయి.

– ముసుగు నాగభూషణ, హోటల్ నిర్వాహకుడు, బత్తలపల్లి

సామాన్యులు బతకలేరు



అన్ని రకాల ధరలు విపరీతంగా పెరగటంతో ప్రజల బతుకు ప్రశ్నార్థకమైంది. కూరగాయల దగ్గర నుంచి ఉప్పు, పప్పు, బియ్యం, చింతపండు ఇలా ఒక్కటేమిటి సామాన్యులకు ఏవీ అందుబాటులో ఉండడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. దళారీ వ్యవస్థ కారణంగా ధరలు విపరీతంగా పెరిగాయి.

-కమతం కాటమయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

ధరల తగ్గింపు ఎక్కడ?



నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు నోరు మెదపడం లేదు. గత ప్రభుత్వంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆరోపించిన వారు... నేడు అంతకు మించి ధరలు పెరిగినా నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. ఏ ఒక్క సంక్షేమ పథకమూ అమలు కాలేదు. అయినా ఎందుకు ధరలు పెరిగాయి?

– బగ్గిరి నిర్మల, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, గుమ్మళ్లకుంట, బత్తలపల్లి మండలం

సమన్వయంతో పంచాయతీల అభివృద్ధి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకట రంగారావు

తాడిమర్రి: మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ వెంకట రంగారావు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని తొమ్మిది శాఖల అధికారులు, సర్పంచులు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రభుత్వ అధికారి గ్రామ పంచాయితీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ, ఉపాధి హామీ పనులు, వ్యవసాయం తదితర తొమ్మిది లక్ష్యాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. అనంతరం ఏఓ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ విజయశేఖర్ నాయుడు, పశువైద్యాధికారి స్వర్ణలత, హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, ఏపీఓ సంజీవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫమీద తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయం



అడిషనల్ ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

పుట్టపర్తి టౌన్: జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య అని ఏపీయూడబ్ల్యూజే నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో న్యూస్ కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై సినీనటుడు మోహన్‌బాబు దాడికి పాల్పడటాన్ని ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం పుట్టపర్తిలోని గణేష్ కూడలిలో నిరసన తెలిపారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, సినీనటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధానకార్యదర్శి బాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధక్షుడు హరికృష్ణ, ఐజేయూ కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడిన సినీనటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని ఎన్పీకుంటలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఫయాజ్‌ఖాన్, ప్రభాకర్, ట్రెజరర్ అబ్దుల్‌ఘని, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

ధర్మవరం రూరల్: మీడియా ప్రతినిధులపై ప్రముఖ సినీ నటుడు మోహన్‌బాబు భౌతికంగా దాడులకు పాల్పడడం అమానుషమని ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం రెవెన్యూ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జూనపాటి మోహన్, జాంపుల్ల అజయ్‌చౌదరి పేర్కొన్నారు. బుధవారం మీడియా ప్రతినిధులపై దాడిని నిరసిస్తూ ధర్మవరంలో జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం టూటౌన్ సీఐ రెడ్డప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి



దాదులూరులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

కనగానపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీ.వీ.ప్రసాద్ తెలిపారు. మండలంలోని దాదులూరు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 3, రేషన్‌కార్డుల కోసం 12 అర్జీలు వచ్చినట్లు స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా రెవెన్యూ సదస్సుకు స్థానిక ప్రజాప్రతినిధులను కూడా అధికారులు ఆహ్వానించలేదని గ్రామ సర్పంచ్ ఈశ్వరమ్మ తెలిపారు. ప్రొటోకాల్ పాటించకుండా గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సరళ, వీఆర్వోలు చెన్నకేశవులు, చంద్ర, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

బత్తలపల్లి: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు తెలిపి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ స్వర్ణలత సూచించారు. బుధవారం దంపెట్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ యజమానులు అర్జీ రూపంలో సమస్యలను అధికారులకు వివరించాలన్నారు. మండల సర్వేయర్ జోసెఫ్, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, వీఆర్వో నరసింహులు, గ్రామ సర్వేయర్ రవికిరణ్, సచివాలయ ఉద్యోగులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై 32 ఫిర్యాదులు

అమడగూరు: తుమ్మలలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి 32 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ రామకృష్ణారెడ్డి, వీఆర్ఓ మహేంద్రప్రసాద్, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ



ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

- రేపటి ర్యాలీని జయప్రదం చేయాలని సమన్వయకర్త మక్బూల్ పిలుపు

కదిరి టౌన్: అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. రైతు సమస్యలపై ఈ నెల 13న జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీ, కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం కదిరిలోని పార్టీ కార్యాలయంలో లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ అధికారం కోసం చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. కానీ హామీలు అమలు చేయకుండా రైతులను, ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని విమర్శించారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకూ దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోలేదన్నారు. రైతుల పక్షాన నిలిచి, వారి సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వరకు చేపట్టే ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున రైతులు పాల్గొనాలని కోరారు. ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, మాజీ సమన్వయకర్త ఇస్మాయిల్, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు లింగాల కృపాకర్‌రెడ్డి, రాంప్రసాద్, ఖాశీం,నాయకులు పరికి సాధిక్ బాషా, కుర్లి శివారెడ్డి, బాలకృష్ణనాయుడు, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి



దెబ్బతిన్న వరిమడిని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కదిరి అర్బన్: పట్నం గ్రామంలో రైతు రామ్మోహన్‌రెడ్డి ఆరు ఎకరాల్లో సాగు చేసిన వరిపంట ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, సీఈసీ మెంబర్ పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాతో కలిసి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మక్బూల్ మాట్లాడుతూ రైతులు పంట నష్టపోయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రకృతి విపత్తులతో పంట నష్టపోతే ఏ సీజన్‌కు సంబంధించి ఆ సీజన్‌లోనే పరిహారం అందించి ఆదుకునేవారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, అగ్రి అడ్వయిజరీ బోర్డు జిల్లా మెంబర్ సుధీర్‌రెడ్డి, పట్నం సర్పంచ్ చలపతి నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, కృష్ణానాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు

కదిరి టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేసే అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలు బుధవారం కూడా కొనసాగాయి. కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కదిరప్ప,భాస్కర్ తదితరులు దీక్షలకు మద్దతు పలికారు.

ప్రజలతో పోలీస్ ముఖా ముఖి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నిజాంవలి కాలనీ ప్రజలతో బుధవారం సాయంత్రం డీఎస్పీ శివనారాయణస్వామి ముఖాముఖి నిర్వహించారు. డ్రగ్స్, సెల్‌ఫోన్, సైబర్ నేరాలు, ఏటీఎం కార్డుల మార్పిడి, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ వి.నారాయణరెడ్డి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

జేసీబీ, టిప్పర్ పట్టివేత

బత్తలపల్లి: కోడేకండ్ల గ్రామం వద్ద నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న జేసీబీ, టిప్పర్ వాహనాలను పట్టుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మండలంలోని కోడేకండ్ల గ్రామం వద్ద ఇసుక డంప్‌ను ఏర్పాటు చేసుకుని అక్కడ నుంచి టిప్పర్‌కు జేసీబీ సాయంతో నింపుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ ప్రభాకర్ ఆదేశాలతో దాడులు చేసినట్లు తెలిపారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు.

పోరెడ్డిచెరువు సాగు నీటి ఎన్నికల నోటిఫికేషన్

గాండ్లపెంట: పోరెడ్డిచెరువు సాగునీటి సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను చిన్ననీటి పారుదల శాఖ ఏఈఈ అరుణ బుధవారం విడుదల చేశారు. ఈ నెల 14న 9.45 నుంచి 10.15 గంటల వరకు నామినేషన్లు, 10.15 నుంచి 10.30 గంటల వరకు జాబితా ప్రకటన, 10.30 నుంచి 12.30 గంటల వరకు ఆరుగురు ప్రాదేశిక సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నిక జరుగుతుందన్నారు. అనంతరం ఎన్నికైన వారికి డిక్లరేషన్ అందిస్తామని ఏఈఈ చెప్పారు.

ఎన్పీకుంట: మండలంలో ఈ నెల 14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్ బుధవారం తెలిపారు. ధనియానిచెరువు, వంకమద్ది చెరువులతో పాటు పెడబల్లి రిజర్వాయర్ ఆయకట్టు కింద 1,269 మందికి ఓటు హక్కు ఉందని వివరించారు. తహసీల్దార్ కార్యాలయంతో పాటు సంబంధిత సచివాలయాలలో ఓటరు జాబితా ప్రదర్శించినట్లు తెలిపారు. 14న నామినేషన్‌లు స్వీకరిస్తారని, అదే రోజు ఎన్నికలు నిర్వహిస్తారని వెల్లడించారు. మండల వ్యవసాయ అధకారి లోకేశ్వరరెడ్డి, ఎంఈఓ గోపాల్ నాయక్, హెచ్ఎస్ఎస్ ఏఈలు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని అన్నారు.

సమన్వయంతోనే మండల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

బత్తలపల్లి: ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో 'ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక 2024–25'పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ త్రివేణి, ఎంపీడీఓ నరసింహనాయుడు మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు సాగాలన్నారు. గ్రామాలు అభివృద్ధి బాట పడితేనే మండలం అభివృద్ధి చెందినట్లన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏఓ శ్రీనివాసులుతో పాటు ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలధారులకు ఆర్డీటీ వైద్యులు అక్బర్ బాషా, డాక్టర్ అభిషేక్‌రెడ్డి, డాక్టర్ జగన్‌బాబు, డాక్టర్ మనీష్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్‌సాయి, డాక్టర్ శ్రీధర్ భిక్ష ఏర్పాటు చేశారు. తొలుత ఆలయంలో గణపతి, అయ్యప్ప, అమ్మవార్లకు గురుస్వామి శెట్టిప్పస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్డీటీ వైద్యులు అయ్యప్పమాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

కారు బోల్తా.. ఒకరికి గాయాలు

బత్తలపల్లి: గుమ్మళ్లకుంట క్రాస్ వద్ద బుధవారం జరిగిన కారు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటగారిపల్లికి చెందిన బోయపాటి అవినాష్ కదిరిలో జరిగే బంధువుల వివాహానికి కారులో బయల్దేరారు. గుమ్మళ్లకుంట క్రాస్ వద్ద కారు టైరు పగిలి అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన అవినాష్‌ను స్థానికులు ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

శ్రీరాముని విగ్రహానికి విరాళం

తనకల్లు: కొర్తికోటలో నిర్మిస్తున్న రామాలయంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట కోసం మాజీ సర్పంచ్ మస్తాన్‌వలి బుధవారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే ఆలయ నిర్మాణం కోసం రూ. 2 లక్షలు త్వరలోనే అందజేస్తానన్నారు. విగ్రహ ప్రతిష్ట రోజున అయ్యే మొత్తం ఖర్చును తానే భరిస్తానని మస్తాన్‌వలి తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

చెన్నేకొత్తపల్లి: చందమూరు వద్ద రోడ్డుపై పడిన గుంతలను పోలీసులు బుధవారం పూడ్చివేయించారు. ఎన్ఎస్ గేట్ - ధర్మవరం మార్గంలోని కల్వర్టుకు ఇరువైపులా గుంతలు పడ్డాయి. ఇది మలుపు వద్ద ఉండటంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. విషయం తెలుసుకున్న చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలసి రోడ్డును పరిశీలించారు. జేసీబీ సాయంతో గుంతలను పూడ్చి వేయించారు. వాహనదారులు పోలీసులను అభినందించారు.

సమష్టి కృషితో లక్ష్యాల సాధన

ధర్మవరం రూరల్: అధికారులు, ప్రజా ప్రతినిధుల సమష్టి కృషితోనే మండలంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని ఎంపీడీఓ సాయి మనోహర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ (ఎల్ఎస్‌డీజీ)పై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సంక్షేమ, విద్యా సహాయకులు, పశువర్ధక శాఖ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.